క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. శేరిగూడ ఫీడర్ పరిధిలోని ఉప్పరిగూడ, కర్ణంగూడ ఫీడర్ల పరిధిలోని కర్ణంగూడ గ్రామాలకు సంబంధించి గృహ, వ్యవసాయ వినియోగదారులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందకి సహకరించాలని కోరారు.

బాలల సంరక్షణ కమిటీ నియామకం



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీటీసీ గోపాల్, సిబ్బంది

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌లో బాలల సంరక్షణ కమిటీని గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి ఆధ్వర్యంలో నియమించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి మాట్లాడుతూ.. బాలలతో స్నేహపూర్వకంగా మెలగాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, బాలలకు ఏ సమస్య వచ్చిన అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ గోపాల్,వార్డు సభ్యురాలు రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, వాణిశ్రీ, నస్రీన్ గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు ఉన్నారు.

చేతి వృత్తులతో ఉపాధి పొందండి

జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి



ఎంబ్రాయిడరీ మెషీన్‌ను ప్రారంభిస్తున్న నిత్యారెడ్డి

మంచాల: మహిళలు స్వశక్తితో ఎదగాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం(యూఎస్‌ఏ) మాజీ అధ్యక్షురాలు కవిత చెల్లా అన్నారు. గురువారం మంచాల మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో దాత అనిరెడ్డిదివిష్‌రెడ్డి, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ వారి సహకారంతో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మెషీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు కేవలం వంటింటికే పరిమితం కావొద్దన్నారు. చేతి వృత్తులను నేర్చుకొని ఉపాధి పొందాలన్నారు. కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. మహిళల అభివృద్ధి విషయంలో తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి సర్పంచ్ వినోద మూర్తి, వార్డుసభ్యులు, గ్రామంలోని మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కడ్తాల్: ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని తలకొండపల్లి ఎంపీపీ నిర్మల, కడ్తాల్ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. డాక్టర్ అఖిల్ ఆధ్వర్యంలోని వైద్య బృందం 315 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరాలను సద్వినియోగ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ఉపసర్పంచ్ శ్రీనునాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, స్థానిక నాయకులు ఉన్నారు.

చెరువుల పరిశీలన

ఆమనగల్లు: మాడ్గుల మండలంలోని కొల్కుల పల్లి, మాడ్గుల, బ్రహ్మణపల్లి, అప్పారెడ్డిపల్లి, నాగిళ్ల గ్రామాల్లో గురువారం పలు చెరువులను మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు, ఇరిగేషన్ ఏఈ చంద్రకాంత్ పరిశీలించారు. చెరువుల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద పూడికతీత పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతి వచ్చిన తర్వాత పూడికతీత పనులు చేపడతామని ఈ సందర్భంగా ఎంపీడీఓ తెలిపారు.

వడగళ్ల బీభత్సం



యాచారం: చింతపట్ల సమీపంలో వడగళ్లకు ధ్వంసమైన పౌల్ట్రీ షెడ్

- కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో భారీ వర్షం
- వేల ఎకరాల్లో పంట, ఆస్తి నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతన్నలు

యాచారం: ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం గురువారం మండలంలోని పలు గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. క్షణాల వ్యవధిలోనే ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్లు కురవడంతో పొలాల్లో ఉన్న రైతులు, రేకుల ఇళ్లలో ఉన్నవారు భయాందోళనకు గురయ్యారు. మంతన్‌గౌరెల్లి గ్రామంలో 60 రేకుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. పది కార్లకు పైగా అద్దాలు పగిలిపోయాయి. నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, చింతపట్ల తదితర గ్రామాల్లో 20కి పైగా పౌల్ట్రీఫాంల షెడ్ల రేకులు పూర్తిగా రంధ్రాలు పడి ధ్వంసమయ్యాయి. పౌల్ట్రీఫాంల షెడ్ల రంధ్రాల ద్వారా వడగళ్లు కోళ్లపై పడి దాదాపు 5 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. పాడి పశువులకు గాయాలయ్యాయి. మంతన్‌గౌరెల్లిలో పదో తరగతి చదివే ఓంకేశ్వర మమత, లక్ష్మమ్మ తలపై వడగళ్లు పడటంతో తీవ్ర గాయాలు కావడంతో మాల్‌లోని ఆస్పత్రికి తరలించారు. మండలంలోని 3 వేల ఎకరాలకు పైగా వరి, మామిడి, కూరగాయల తోటలకు తీవ్ర నష్టం జరిగింది. టమాటా, వంకాయ, బెండ, చిక్కుడు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొండిగౌరెల్లిలో వందల ఎకరాల్లో సాగు చేసిన పుదీనా పంట పూర్తిగా నష్టపోయింది.

నేడు ఎమ్మెల్యే పర్యటన..

మండల పరిధిలోని మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల తదితర గ్రామాల్లో వడగళ్ల వర్షం కురిసిన విషయమై బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్.. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎంపీడీఓ విజయలక్ష్మి, యాచారం సీఐ లింగయ్య, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు గురువారం సాయంత్రం మంతన్‌గౌరెల్లి గ్రామంలో పర్యటించి నష్టపోయిన పంటలను, దెబ్బతిన్న ఇళ్లు, కార్లను పరిశీలించారు. రెవెన్యూ ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం ఉదయం మంతన్‌గౌరెల్లితో పాటు పలు గ్రామాల్లో పంటలను పరిశీలించనున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు.



యాచారం: మంతన్‌గౌరెల్లిలో దెబ్బతిన్న వరి పంట



ఆమనగల్లులో జాతీయ రహదారిపై నిలిచిన వర్షపునీరు



ఓఆర్‌ఆర్ సమీపంలోని పొలాల్లో..

మంచాల మండలంలో..

మంచాల: వడగండ్ల వర్షాలతో మంచాల మండలంలోని పలు గ్రామాల్లో పంట చేలు దెబ్బతిన్నాయి. గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. మండల పరిధిలోని బోడకొండ, ఎల్లమ్మ తండా, కొర్రవాణి తండా, సత్తి తండా, ఆంబోత్ తండా గ్రామాల్లో వడగండ్లు పెద్ద ఎత్తున పడ్డాయి. వరి పంటలు దెబ్బతిన్నాయి.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.మధ్యాహ్నం నుంచే వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో వర్షం ప్రారంభమై దాదాపు గంటపాటు కురిసింది. పలుచోట్ల వర్షంతో పాటు వడగండ్లు పడ్డాయి. స్థానిక పట్టణంలోని జాతీయ రహదారిపై వర్షం నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండున్నర గంటల తర్వాత ఒక్కసారిగా వాతావారణం చల్లబడింది. ఇటీవల పగటిపూట ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోతతో సతమతమౌతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనాన్ని కలిగించింది. మండలంలో వడగండ్ల వర్షం కురిసి పంట నష్టం జరిగినట్లు సమాచారం ఇప్పటివరకు రాలేదని మండల వ్యవసాయాధికారి వరప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపారు.

ఇంటి నిర్మాణాలకు ఉప్పల ట్రస్టు చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన నక్క రాములు, పెంటమోల మాధవులు, కోల వెంకటేశ్ ఇటీవల ఇండ్ల నిర్మాణాలను చేపట్టారు. అయితే డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణాలను నిలిపివేశారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను కలుసుకొని ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. గురువారం ట్రస్టు సభ్యులచే ఇంటి నిర్మాణాలకు ఇసుక, సిమెంట్, స్టీల్, తదితర మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, అంజయ్య, రాజశేఖర్, చందు, మహేష్, మల్లయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన ఈసరి రాములు ఇటీవల మృతి చెందాడు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఫౌండేషన్ సభ్యులచే గురువారం రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, శ్రీనివాస్, సర్పంచ్ అనురాధ, నరేందర్‌గౌడ్, ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, భరత్, విజయ్, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

300 మందికి కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్, పెద్దూర్‌తండాలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 300 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు కల్పన, స్నేహ, సైదమ్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్రు, కిషన్, ఎంపీటీసీ రఘునాయక్, హెచ్‌ఏలు మల్లయ్య, రామచంద్రయ్య, నాగమల్లీశ్వరి, రవికుమార్, శివకుమార్, మల్లికార్జున్, రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర విధానాలపై పోరాటం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



జీపు జాతను ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

యాచారం: కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఏప్రిల్ 5న పార్లమెంట్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో.. రైతులు, కార్మికుల్లో చైతన్యం కల్పించేందుకు యాచారం మండల కేంద్రంలో గురువారం జీపుజాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగాన్ని నాశనం చేసే పనిలో ఉందన్నారు. రైతులు, కార్మికుల్లో చైతన్యం కల్పించేందుకు గాను ఈనెల 21 వరకు పలు ప్రాంతాల్లో జీపుజాతలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులకు అండగా ఉండి కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఎన్‌డీఏ సర్కార్‌పై రాజీలేని పోరాటం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.అంజయ్య, కె.జగన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, సీఐటీయూ శ్రామిక మహిళా కార్యదర్శి కవిత, కేవీపీఎస్ జిల్లా నాయకులు సామేల్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



మంతన్‌గౌరెల్లిలో బాధితులతో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: వడగండ్ల బీభత్సంతో మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం తక్షణమే రైతులకు పరిహారం అందజేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించి వడగండ్ల వల్ల నష్టపోయిన పంటలను, దెబ్బతిన్న ఇళ్లను, మృత్యువాతకు గురైన కోళ్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఉన్నతాధికారుల ద్వారా.. నష్టపోయిన పంటలు, మృత్యువాతకు గురైన కోళ్లను, దెబ్బతిన్న ఇళ్ల సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంతన్‌గౌరెల్లి సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతినాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరవింద్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, గణేష్‌నాయక్, కిషన్‌నాయక్, చందునాయక్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘రణభేరిని జయప్రదం చేయండి’



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌నాయక్

కడ్తాల్: ఈనెల 26న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ‘జై భారత్ సామాజిక విప్లవ రణభేరి’ని జయప్రదం చేయాలని, జై భారత్ ఎస్టీ పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. జై భారత్ ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట వేదికలు లక్ష్య సాధన కోసం.. కలిసి వచ్చే మరిన్ని సంస్థలతో ఐక్యంగా పనిచేసేందుకు సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవనంలో రణభేరిని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐక్యవేదిక ద్వారా సామాజిక న్యాయం, కుల నిర్మూళనే లక్ష్యంగా.. కలిసి పనిచేసేందుకు ప్రతి ఒక్కరూ సభకు రావాలని కోరారు. ఇటీవల ఆత్మహత్యకు గురైన ప్రీతి కుటుంబాన్ని, హత్యకు గురైన నవీన్‌నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలని, వీటికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైసిగండి సర్పంచ్ తులసీరాం నాయక్, జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లి రాములు ఉన్నారు.

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కృషి

బీఆర్‌ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

హయత్‌నగర్: బీఆర్‌ఎస్ యవనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర గురువారం పెద్దంబర్‌పేట్ మున్సిపాలిటీలోకి ప్రవేశించింది. మున్సిపాలిటీలోని పస్మాములలో పాదయాత్రకు ప్రజలు, టీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ప్రశాంత్‌కుమార్ రెడ్డి గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిలో కలిసిన తర్వాత పస్మాముల గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. గ్రామంలో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి సరిపడా నిధులను తీసుకొచ్చి మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిద్ధంకి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్, భాస్కర్‌గౌడ్, ఈదమ్మ బలరామ్, కౌన్సిలర్లు హరిశంకర్, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ నిలిపే వరకు ఉద్యమం

సాకిబండతండాలో అఖిలపక్షం నాయకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండాలో మైనింగ్ పనులను నిలిపివేయకపోతే అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వివిధ పార్టీల నాయకులు హెచ్చరించారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా మైనింగ్‌కు అనుమతి ఎలా ఇస్తారని పలువురు ప్రశ్నించారు. సాకిబండతాండాలో మైనింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో గురువారం సాకిబండతండాలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ జాతీయ నాయకులు ఆచారి, బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, ఆమనగల్లు మున్సిపాలిటీ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మైనింగ్‌తో తాము పడుతున్న ఇబ్బందులను అఖిలపక్షనాయకులకు వివరించారు. మైనింగ్ పనులు చేపట్టడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని దుమ్ముధూళితో అనారోగ్యం బారినపడుతున్నామని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని వివరించారు. అనంతరం అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జోక్యం చేసుకుని మైనింగ్ పనులకు అనుమతులు రద్దు చేయించాలని వారు డిమాండ్ చేశారు. మైనింగ్ పనులకు అనుమతిచ్చే సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతారని కానీ సాకిబండతండా సమీపంలో మైనింగ్ అనుమతికి ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా అక్రమంగా అనుమతిచ్చారని వారు ఆరోపించారు. పనులు నిలిపివేయకపోతే రెండు మూడు రోజుల్లో తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని అప్పటికీ మైనింగ్ పనులు రద్దు చేయకపోతే భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు రమేశ్‌నాయక్, శ్రీను, వినోద్, ప్రభాకర్, విక్రంరెడ్డి, శేఖర్ రెడ్డి, రవిరాథోడ్, రాజేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

సర్పంచ్ శ్రీశైలం

తలకొండపల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు భోజనంలో ఆకుకూరలు, పాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలో ఇచ్చే బాలామృతం, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జంగయ్య, పర్యవేక్షకులు మమత, అంగన్‌వాడీ టీచర్ సుమిత్ర, బౌరమ్మ, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

21న తైబజారు వేలం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ 2023–24 సంవత్సరానికి తైబజారు వేలం ఈనెల 21న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.2.50 లక్షలు డీడీ తీసి ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు మున్సిపల్ కార్యాలయంలో అందించాలని ఆయన సూచించారు.

ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. డీఎం అశోక్‌రాజు సూచన మేరు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ వ్యాపారి ఎర్రమల్ల శ్రీనివాస్ ఈ చలివేంద్రానికి రోజు నీటిని పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి కేవీ రమేష్‌రాజు, పసునూరి వినోద్, ఆర్టీసీ ఉద్యోగి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం

దాతృత్వం చాటిన తలారి మల్లేశ్


దివ్యాంగుడికి కృత్రిమ కాలు అమర్చేందుకు ఆర్థికసాయం



దివ్యాంగుడు వెంకటయ్యతో మల్లేశ్

యాచారం: కాలుకు తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రిలో కాలును తొలగించారు. ఇక ఒంటి కాలితో నడవలేననే బాధతో ఉన్న దివ్యాంగుడికి ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్ కృతిమ కాలును బిగించి అండగా నిలిచాడు. వివరాలు... మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పంతం వెంకటయ్యకు కుడి కాలికి తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రిలో కొద్దినెలల కింద కాలును తీసేసారు. దీంతో అప్పటి నుంచి ఒక కాలుతో నడవలేక ఇంట్లోనే ఉంటున్నాడు. ఇక నేను నడవలేననే బాధతో ఉన్న వెంకటయ్యకు గ్రామానికి చెందిన తలారి మల్లేశ్ గురువారం నగరానికి తీసుకెళ్లి తన సొంత డబ్బులు పెట్టి కృతిమ కాలును అమర్చించాడు. దీంతో వెంకటయ్య ప్రస్తుతం కృతిమ కాలుతో ఎప్పటి మాదిరిగానే నడుస్తున్నాడు. ఈ సందర్భంగా తలారి మల్లేశ్‌కు దివ్యాంగుడు వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపాడు.

భక్తి భావం పెంపొందించుకోవాలి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వంపూగూడ గ్రామంలో ఈదమ్మ దేవత కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం మైసిగండి గ్రామానికి చెందిన కంశికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.19వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు చంద్రశేఖర్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ వీరయ్య, టీఆర్‌ఎస్ తలకొండపల్లి మండల అధ్యక్షుడు శంకర్, సర్పంచ్‌లు కృష్ణయ్యయాదవ్, తులసీరాం నాయక్, లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపసర్పంచ్‌లు జైపాల్ రెడ్డి, వినోద్, నాయకులు రాజేందర్‌యాదవ్, భిక్షపతి, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

చెరువు పూడికతీతకు అనుమతివ్వండి

తహసీల్దార్‌కు మెదక్‌పల్లి గ్రామస్తుల వినతి

తలకొండపల్లి: చెరువులో మట్టిని తరలించి పూడికతీతకు అనుమతి ఇవ్వాలని మెదక్‌పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని మెదక్‌పల్లిలో 123 సర్వే నంబర్‌లో ఉన్న ఎర్రగుంట చెరువులో మట్టిని తరలించి పూడికతీత కోసం ప్రైవేట్ వ్యాపారస్తులకు అప్పగించామని తహసీల్దార్‌కు విన్నవించారు. పూడికతీత వల్ల చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి బోర్లల్లో నీటిమట్టం వృద్ధి చెందుతుందని వివరించారు. రైతుల క్షేమం కోరి గ్రామాభివృద్ధి దృష్ట్యా అనుమతివ్వాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకుపోతానని వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నరేష్, వార్డు సభ్యులు చెన్నయ్య, రాజు, వెంకటమ్మ, కిష్టమ్మ, పెంటయ్యగౌడ్, రాములయ్యగౌడ్, అంజయ్యగౌడ్, పర్వతాలు, నరేష్, శ్రీకాంత్, శ్రీను, నర్సింహ, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.